పెండ్యాల నాగాంజనేయులు

# మా ఉప్పాయిగాడి భక్తి!

తిండిపుష్టి, నిద్రపుష్టిగల మా ఉప్పాయిగాడు హఠాత్తుగా ఆ రెండూ మానేశాడు. సినిమాలు మానేశాడు; క్రికెట్ మానేశాడు; గెడ్డం, స్నానం, షోకులూ మానేశాడు. ప్రతి రోజూ ఎవరితోనో ఒకరితో దేవుడు లేడని వాదించేవాడు—అదీ మానేశాడు. శరీరం కేవలం కటిక నేలమీదా, దృష్టి దూలాలమీదా పారేసి 'ఇష్' అంటూ నిట్టూర్పులు మొదలెట్టాడు. ఉన్నట్టుండి యింత మార్పేమిటో నాకూ, మా శ్రీమతికీ ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు.

ఒకరోజు మెల్లిగా దగ్గరికెళ్ళి "ఏమైందిరా?" అనడిగాను. చాలాసేపటివరకూ సమాధానం లేదు. నా సతాయింపు ఎక్కువయ్యేసరికి 'కయ్'మంటూ లేచి,


"నన్ను విసిగించకండి! నేనేదో ఆలోచించుకుంటున్నాను" అంటూ కసురుకున్నాడు.

వాడు చదువుతున్నది బి.ఏ.; అందులోనూ లెక్కలు వాడి సబ్జక్టు. బహుశా ఏ ప్రాబ్లెమో సాల్వ్ చెయ్యడానికి మథనపడుతున్నాడని అర్థమైంది. బెంగపడుతున్న మా శ్రీమతికి అదే మాట చెప్పి ఓదార్చి ఆ పూట నేనే వంట చేశాను.

ఓ రోజు వుదయం వాడు లావేటరీకి వెళ్ళిన సమయంలో ఇల్లు ఊడుస్తున్న మా శ్రీమతికి వాడి పెట్టెలో జొరబడుతున్న చిమ్మెటొకటి కనబడింది. పాపం! బిడ్డ బట్టలన్నీ కొట్టేస్తుందేమోనన్న భయంతో పెట్టె తెరిచింది. గుడ్డలన్నీ తీసి కిందపెట్టింది. అడుగున చిమ్మెటతో బాటు రిజిష్టరు పోస్టులో వచ్చిన కవరొకటి కనబడింది. చిమ్మెటనొదిలేసి "ఇదేమిటండీ?" అంటూ ఆ కవరు నా చేతిలో పెట్టింది.

ఆశ్చర్యంతో ఆత్రంగా విప్పి చూశాను.

యూనివర్శిటీ వాళ్ళు ఉప్పాయిగాడికి వ్రాసిన దబాయింపు వుత్తరం! పోయిన ఏప్రిల్లో జరిగిన యూనివర్సిటీ పరీక్షల్లో వాడి ఆన్సరు పేపరు, మరొకడి ఆన్సరు పేపరు మక్కీకి మక్కీగా వున్నాయట: సంజాయిషీ అడిగారు వాళ్ళు! పది రోజుల్లోగా సంతృప్తికరమైన సమాధానం



రాకపోతే డొక్క చింపేస్తామన్నారు!

"అమ్మ దొంగవెధవా! ఇదా నీ ఆలోచన!!" అనుకుంటూండగానే ఉప్పాయిగాడొచ్చాడు.

నేనూ మా యావిడ కూడా రకరకాల తిట్లు పిండివంటలూ చేసిపెట్టాం. కిక్కురుమనకుండా అన్నీ తినేశాడు.

"సమాధానం రాశావురా?" అనడిగాడు.

"లేదు" అన్నాడు.

నా మేధాశక్తినంతా ఉపయోగించి, జాగ్రత్తగా ఆలోచించి యూనివర్సిటీ వాళ్ళకు సమాధానం రాయించాను.

"ఏమండీ! ఏం జరుగుతుందంటారు?" అంది మాయావిడ దిగులుగా.

"ఏముందీ! ఈ సమాధానం సంతృప్తిగా వుంటే క్షమించి, వార్నింగిచ్చి వదిలేస్తారు. లేకపోతే ఏడాది నుంచి మూడేళ్ళదాకా ఎక్కడా పరీక్షకు కూర్చునే యోగ్యతలేకుండా చేస్తారు" అన్నాన్నేను.

ఆవిడకు బాధతోబాటు కోపమూ వచ్చింది. ఒక్కగానొక్క కొడుకు అనే విషయం కూడా మర్చిపోయి, "వెధవ చచ్చినాడా! కడుపూ నోరూ కట్టుకుని, అష్టకష్టాలూపడి చదువు చెప్పిస్తుంటే మాయరోగం వచ్చిందా నీకు! అసలు దైవభక్తి లేకపోబట్టే ఇంతనర్థం జరిగింది. పాపిష్టి వెధవా" అంటూ వాడి నెత్తిన మొట్టింది,

వాడిలో చైతన్యం లేదు: బాధలేదు: చూపులో మార్పులేదు.

ఆ మర్నాడుదయం నేను నిద్ర లేచేసరికి ఉప్పాయిగాడు లేడు. స్నానంచేసి సైకిలేసుకెళ్ళిపోయాట్ట! అడిగినా కూడా మా శ్రీమతితో చెప్పలేదట!

ఆలోచనలో పడ్డాన్నేను.

మాయావిడకు మాత్రం భయం.

"ఏమండీ! వీడేమన్నా అఘాయిత్యం చేస్తాడేమోనండీ!" అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"ఛఛ! అఘాయిత్యం చేసేవాడికి సైకిలెందుకే? పైగా స్నానంచేసి ఎందుకెళ్తాడు? చచ్చిపోవడానికి మడి కట్టుకోవాలా?" అంటూ ఆవిడ భయం కొట్టిపారేశాను.

ఇద్దరమూ రకరకాలుగా ఆలోచిస్తూ కూర్చున్నాం.

9 గంటల వేళొచ్చాడు వాడు!

ముఖాన విభూతి! నొసట కుంకుమబొట్టు!!

నా నాస్తికుడు ఆస్తికుడయ్యాడా?!!

మాయావిడకు నోట మాటరాలేదు.

ఏమైనా కామెంట్ చేస్తుందేమోనని, ఆవిణ్ణేమీ మాట్లాడొద్దని సంజ్ఞచేసి మెల్లిగా నేనే అడిగాను.

"ఎక్కడికెళ్ళావురా?" అని.

"మాంగాడు" అని క్లుప్తంగా సమాధానం!

ఈ 'మాంగాడు' అనే గ్రామం మద్రాసుకు పదిమైళ్ళ దూరంలో వుంది. అక్కడ 'కామాక్షి' అమ్మవారి దేవాలయముంది. వారంలో ఏదో ఒక రోజు నిర్ణయించుకుని ఆరువారాలపాటు వెళ్ళి దర్శనం చేసుకోవాలట! ఆమె చాలా సత్యమైన దేవతనీ, ఎంత జటిల సమస్యల్లో మునిగిపోతున్న వాళ్ళనైనా ఇట్టే ఒడ్డుకు చేర్చుతుందనీ రకరకాలుగా చెప్పుకుంటున్నారంతా. మా వాడి విషయంలో భయపడ్తున్న నాకూ, మాయావిడకు కూడా కొండంత ధైర్యం చిక్కింది—మావాడి చర్య వల్ల!

ఎంత ధైర్యంవున్నా కొంత మన ప్రయత్నం కూడా కావాలిగదా అని మావాణ్ని వెంటేసుకుని కనబడిన వాడికెల్లా దణ్ణంపెడ్తూ యూనివర్సిటీ చుట్టూ తిరగడం మొదలుపెట్టా. ఓ వారం తిరిగిన తర్వాత మా మొరాలకించడానికి ఒకాయన సిద్ధపడ్డాడు. విషయం వివరించి, నా శక్తి వంచన లేకుండా ఆయన చేతులు తడిపాను.

"ఓ నెల తర్వాత కనబడండి" అన్నాడాయన.

సరేనని సగం భారం ఆయన మీద కూడా వేసివచ్చేశాం.

ఉప్పాయిగాడు మరీ భక్తుడైపోయినట్లున్నాడు. నిరంతరం పెదాలు కదుల్చుతూ ధ్యానంలో మునిగిపోయాడు. ముఖాన విభూతి, కుంకుం చెరగనివ్వడంలేదు; భోజనం ఒంటిపూట: కతికే నాల్గు మెతుకులూ ఉప్పూకారం లేకుండానే తింటున్నాడు. ఉల్లి, వెల్లుల్లి పూర్తిగా విసర్జించేశాడు. రాత్రులు కాస్త ఉప్పుడు పిండి; కొద్దిగా మజ్జిగ! కాలకృత్యాలు తీర్చుకున్న ప్రతిసారీ కాళ్ళు కడుక్కోవటంతో సరిపెట్టక ప్రతిసారీస్నానం చెయ్యడం మొదలుపెట్టాడు.

"కష్టాలలోగానిభగవంతుడు గుర్తుకురాడు" అని చెప్పడానికి మావాడి చరిత్ర ఒక నిదర్శన

మనిపించింది నాకు.

నెలరోజులూ గడిచాక నేనూ మావాడూ కలిసి యూనివర్సిటీకి వెళ్ళాం.

ఇక మావాడికేమీ ఫర్వాలేదనీ, ఒడ్డున పడిపోయినట్లేననీ ధైర్యం చెప్పాడా ఆసామి. 'కానీ'... అని నసగడం కూడా మొదలెట్టాడు.

అర్థమైంది నాకు. ఈసారి మరికాస్త బాగానే తడిపి ఆయనతో మరింత ధైర్యం చెప్పించుకుని, వాణ్ని ఇంటికి పంపించి నేను వేరే పనిమీద వెళ్ళిపోయా.

ఆ రాత్రి భోజనాల దగ్గర మాయావిడ చెప్పింది: యూనివర్సిటీ నుంచి వచ్చిన దగ్గర్నుంచీ ఉప్పాయిగాడు చాలా హుషారుగా వున్నాడనీ, తెలుగు సినిమాపాటలు విన్నాడనీ, ఆ రోజునుంచే మొదలైన ఇండియాకి, వెస్టిండీస్‌కి జరుగుతున్న క్రికెట్ మాచ్ కామెంటరీ విడవకుండా విన్నాడనీ, తర్వాత పెద్ద గొంతుతో 'పాండవోద్యోగ విజయాల్లో' పద్యాలు పాడాడనీ, పైపెచ్చు కర్ణాటకసంగీతం పాడాడని కూడా సాహసిస్తున్నాడనీ చెప్పింది.

"అమ్మయ్య" అనుకుని, "మరి తిండి?" అనడిగాడు.


"అమ్మమ్మ! తిండి, నియమనిష్ఠల విషయంలో వెంట్రుకవాసి తేడా కూడా రానివ్వడం లేదండీ! అమ్మవారివ్రతం యింకా పూర్తి కాలేదుగా?" అంది మాయావిడ.

తర్వాత రెండురోజులు మావాడి దినచర్య జాగ్రత్తగా గమనించాను. మాయావిడ చెప్పింది నిజమే!

మనసులోనే మాంగాడు తల్లికి వేయి దండాలు పెట్టాను.

మూడోరోజు వుదయం ఏదో పనిమీద నెల్లూరు వెళ్ళి, నాల్గోరోజు చీకటిపడే వేళ తిరిగొచ్చాను.

మా ఇంటికి ముప్ఫయి నలభయి గజాల దూరంలో వున్న ఓ చిన్నవంతెన దగ్గర మా ఉప్పాయిగాడూ, వాడి స్నేహితులూ కూర్చుని ఎందుకో గొల్లున నవ్వుతున్నారు. పైగా మావాడు నున్నగా గుండు గీయించుకుని

వున్నాడు. అంటే?—ఉప్పాయిగాడు యూని వర్సిటీ వాళ్ళ చేతుల్లోనుంచి తప్పించుకోగలిగా డన్నమ్మాట!

గబగబా ఇంట్లోకెళ్ళాను.

"ఏమే! ఉప్పాయిగాడు మాంచి హుషారుగా వున్నట్టున్నాడు. ఏమిటి కథ?" అనడిగాను ఉత్సాహంగా.

"అదేం కథో అదేం హుషారో నేను చెప్పలేను బాబూ! క్రికెట్ మ్యాచ్ కామెంటరీ వింటూండగా ఏదో కవరొచ్చింది. అక్కణ్నించీ ఒకటే తిరణాలనుకోండి. వీడి దుంప తెగ! నూతి పళ్ళెంలో కూర్చుని నూటెనిమిది బొక్కెన్ల నీళ్ళు స్నానం చేశాడు."

"అబ్బా!" అన్నాన్నేను ఆనందంగా.

"ఆఁ! నా బొంద. తాడుతెగింది కావల్ను.... బొక్కెన నూతిలో తగలేశాడు."

"పోతేపోయిందిలేవే వెధవ తాడు! ఈసారి ఏకంగా ఇనపగొలుసే వేయిద్దాం....సరేగాని యింకా ఏం చేశాడే!"

"మంచం విరగ్గొట్టాడు."

"ఎందుకూ?"

"దానిమీదెక్కి ఇంగ్లీషు పాటలూ ఇంగ్లీషు డాన్సులూనూ."

"శని విరగడయింది. ఎప్పటిదో మా తాతల నాటి మంచం! బయట పారేద్దామంటే వీలు కాకుండా వుంది. పోతేపోయింది. ఈ సారి ఇనప మంచం కొనేద్దాంలే! బెంగపడకు."

"అది సరేలెండి! సైకిలేసుకెళ్ళి రెండు టైర్లూ పగలకొట్టుకొచ్చాడు."

"ఆఁ....అవి వఠి చెత్తటైర్లు లెద్దూ."

"వెనక చక్రం అష్టవంకర్లూనూ."

"మనలాగే అది కూడా ఆనందం పట్టలేక అష్టవంకర్లూ తిరిగింది గావల్ను."

"రాత్రంతా నాకు నిద్దర్లేదండీ బాబూ! ఒకటే సర్కసు చెయ్యడం."

"మాంగాడు తల్లి మహిమ!" అంటూ దణ్ణం పెట్టాను.

"వ్రతం పూర్తయిందిగా! ఇవాళ వాడి జిహ్వాచాపల్యం చూడాల్సింది మీరు. అసలు నన్ను పొయ్యిదగ్గరకు రానీలేదండీ! వంటంతా వాడే....దోసకాయపప్పు, వంకాయ కూర, మామిడికాయ పచ్చడి, గుమ్మడికాయ పులుసు ఉల్లిపాయల పకోడీలు....అబ్బో ఏం చెప్పమంటారెండి."

"బాగా చేశాడే?" నోరూరుతుండగా అడిగాన్నేను.

"బ్రహ్మాండంగా! .... నాకు సుఖపడేగీత లేదుగానీ, రేపు వచ్చే కోడలెవత్తో మహా సుఖపడిపోతుంది."

"ఊరికే వండడమేనా? సరిగ్గా తినగలిగాడా?"

"సుబ్బరంగా తిన్నాడు. నూరుగ్రాముల పచ్చిమిరపకాయలు, అరకిలో ఉల్లిపాయలూ కూడా కొరికేశాడు అన్నంలో" అంది మా శ్రీమతి మరింత హుషారుగా.

"శుభవార్తే గదా!" అని ఆత్రంగా అడిగాను.


"లేకపోతే యింత అల్లరెందుకూ....వెధవ వాడంతటవాడే చెప్తాడేమోనని ఎంతసేపో ఎదురు చూశానండీ! చెప్పి చస్తేగా! వుండబట్ట లేక నేనే నిన్నరాత్రి అడిగేశాను. "ఏరా! మాంగాడు కామాక్షి ఏం చేసిందీ?" అని.... అప్పుడు చెప్పాడు. 'సక్సెస్! గ్రాండ్ సక్సెస్ నిజంగా ఆవిడ చాలా సత్యమైన దేవత....' అంటూ ఆ దేవతను ఒకటే పొగడ్డం, ఇవాళే ఆఖరు రోజు గదా వెళ్ళడానికి! శుభ్రంగా ప్రొద్దునలేచి వెళ్ళి ఆ తల్లికి నీలాలిచ్చేసి వచ్చాడు" అంది మాయావిడ.

"సరేగాని, ఇంతకీ ఆ కవరేదీ?" అనడిగాను.

"పెట్టెలోనే పెట్టాడనుకుంటా! వుండండి చారులో పోపెట్టీ...." అంటూ వంటింట్లోకి వెళ్ళిందావిడ.

ఎంతకీ మాయావిడ తెమిలి రాకపోయేసరికి నేనే ఆత్రంగా వాడి పెట్టెలోని కవరు తీసి చూశా!

నాకు దడ, నీరసం పట్టుకున్నాయి. బ్లడ్ ప్రెషర్ కూడా వచ్చింది. వాడు ఇదివరకు రాసిన పరీక్షలు కాన్సిల్ చెయ్యడమే కాకుండా




మరో సంవత్సరందాకా పరీక్షక్కూర్చోడానికి వీల్లేదని దాని సారాంశం!

కోపం పట్టలేక గబగబా వీధిలోకొచ్చాను. మావాడు చేతులు తిప్పేస్తూ, పెద్ద గొంతుకతో హుషారుగా చెప్పేస్తున్నాడు.

"ఒరేయ్! కిందటిసారి మన ఇండియన్ క్రికెట్ టీం పాకిస్తాన్‌వాళ్ళ చేతుల్లో ఓడిపోయినప్పుడెంత బాధపడ్డానో తెలుసా? అసలు నేనెంత అవమానంగా ఫీలయ్యానో తెలుసా? వీధిలో తలెత్తుకు తిరగలేకపోయాను. ఎలా ఈ అవమానం పోతుంది? ఈ సారి వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లోనైనా మన క్రికెట్ టీం గెలుస్తారా లేదా! మనవాళ్ళకి మళ్ళీ సక్సెస్ వచ్చేదెలా? ఇదే ఆలోచన నాకు! ఆ బాధలో ఎన్నో రోజులు అన్నాహారాలు మానేశాను. ఏ దిక్కూ తోచలేదు. జీవన్మరణ సమస్య ఎదురైంది. సడన్‌గా మా అమ్మ 'దైవభక్తి' అనే మాట సూచించింది. అయితే 'ఏ దైవం?' అనేది ప్రశ్న! తిరపతైతే చాలాదూరం! ఖర్చెక్కువ! శ్రమకూడా ఎక్కువే! తక్కువ ఖర్చులో ఎక్కువ ఫలితం కావాలి! అసలే పాపం మా నాన్న డబ్బుకు మహా ఇబ్బంది పడ్తున్నాడు కూడా! ఆ రాత్రంతా ఆలోచించా! మనసులో మాంగాడు తల్లి తళుక్కున మెరిసింది. వెంటనే ఆవిడకు మొక్కుకున్నా. "తల్లీ! నాకేమీ అక్కర్లే! యూనివర్సిటీ గొడవ పరిష్కరించమని కోరడంలేదు! కాని, ఈ సారి వెస్టిండీస్‌తో జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లో మన భారతీయ జట్టుకు సంపూర్ణ విజయం చేకూర్చు! నాకు మనశ్శాంతి కలిగించు! భారతీయ దేవతవైనందుకు నీ దేశభక్తి చాటి చెప్పు" అని.... ఆ తల్లికి నా ఆవేదన అర్థమైంది. నన్ను కటాక్షించింది. నిన్నటితో పూర్తయిన మ్యాచ్‌లో మనవాళ్ళే సంపూర్ణ విజయం సాధించారు. మాసిపోయిన నా మాన మర్యాదలు మళ్ళీ నేను పొందగలిగాను. అందుకే ఇవాళ పుదయమే వెళ్ళి ఆ తల్లికి నీలాలు కూడా భక్తితో సమర్పించుకున్నా" అంటూ గుండు తడుముకున్నాడు.

నేను కుప్పలా కూలిపోయా! □